## ఓటర్లకు సేవలందించేందుకు ముందుకు వచ్చిన బీజేపీ నాయకులు, స్వచ్ఛంద సంస్థలు





- **హైదర్గూడా బస్టాప్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో ఓటర్ల కోసం హెల్ప్ డెస్క్ ఏర్పాటు**

ఇది కద నిజం, అత్తాపూర్: ప్రస్తుతం కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎలక్ట్రోరల్ స్పెషల్ డ్రైవ్ క్షేత్రస్థాయిలో ఊపందుకుంది. అయితే, ఈ ప్రక్రియ సంక్లిష్టంగా ఉండటంతో ఓటర్ల సందేహాలను తీర్చడం, ఫారమ్‌ల పంపిణీ మరియు వివరాలను నమోదు చేయడం వంటి పనులకు బూత్ లెవెల్ అధికారులపై తీవ్ర పనిభారం పడుతోంది. ఈ క్రమంలో అధికారులకు అండగా ఉంటూ, ఓటర్లకు త్వరితగతిన సేవలందించేందుకు పలు రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వస్తున్నాయి. ఇందులో భాగంగా హైదర్గూడా బస్టాప్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డితో పాటు ప్రముఖ సామాజిక సేవకులు మ్యాడం మధుసూదన్, నల్లింగ్ రమేష్, బీట్కూరి సతీష్, సులిగె శ్రీనివాస్, కైల రవీందర్ రెడ్డి, రామ్ రెడ్డి తదితరులు పాల్గొని ఓటర్లకు స్వచ్ఛందంగా సేవలందించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యాలయ కార్యదర్శి సాబాధ విజయ్ కుమార్, అత్తాపూర్ డివిజన్ బీజేపీ క్రియాశీల సభ్యురాలు సాబాద స్వప్న తమ ఎన్యుమరేషన్ ఫారమ్‌లను నింపి సంబంధిత బీఎల్వోలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఎల్వోలు నిషిత, మౌనిక, సాయి ప్రభు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి సంగం లక్ష్మీబాయి పేరు పెట్టాలి

- **మంత్రికి వినతిపత్రం సమర్పించిన వినయ్ కిషోర్ యాదవ్**



ఇది కద నిజం: చంచల్‌గూడా నుంచి సంతోష్‌నగర్ వరకు నిర్మిస్తున్న సైదాబాద్ స్టీల్ బ్రిడ్జికి ప్రముఖ సంఘసేవకురాలు, విద్యావేత్త దివంగత సంగం లక్ష్మీబాయి పేరు పెట్టాలని తెలంగాణ స్వాభిమాన్ పరిషత్ రాష్ట్ర కన్వీనర్ వినయ్ కిషోర్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి మరియు హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం సైదాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వినయ్ కిషోర్ యాదవ్ మాట్లాడుతూ, నిరుపేద విద్యార్థుల కోసం దశాబ్దాల క్రితమే ఇందిరా సేవా సదన్ విద్యాసంస్థలను స్థాపించి, వేలాది మందిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిన సంగం లక్ష్మీబాయి సేవలు మరువలేనివని కొనియాడారు. సంఘ సంస్కర్తగా, రాజకీయ నాయకురాలిగా ఆమె సైదాబాద్ ప్రాంతానికి గర్వకారణమని, ఆమె గౌరవార్థం ఈ బ్రిడ్జికి ఆమె పేరును నామకరణం చేయాలని కోరారు. ఈ డిమాండ్ నెరవేరే వరకు ముఖ్యమంత్రి, సంబంధిత ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పిస్తామని స్వాభిమాన్ పరిషత్ ప్రతినిధులు రాజు యాదవ్, సంతోష్, లక్ష్మీ నారాయణ, దయానంద, వేణు, రాకేష్, శ్రీకాంత్, ప్రభాకర్, శ్రీనివాస్, శేఖర్, సురేష్, ప్రమోద్‌లు స్పష్టం చేశారు.

## అక్టోబర్ 2 నుంచి జై స్వరాజ్ పార్టీ "గ్రామ స్వరాజ్ మహా సంకల్ప బైక్ యాత్ర"

- **ప్రతి గ్రామానికి ఆర్థిక భద్రతే లక్ష్యం**

**- రాజయోగి కాసాని శ్రీనివాసరావు గౌడ**



ఇది కద నిజం:మహాత్మా గాంధీ కలలుగన్న "గ్రామ స్వరాజ్యం" స్ఫూర్తితో, తెలంగాణలో గ్రామీణ పునర్నిర్మాణం లక్ష్యంగా జై స్వరాజ్ పార్టీ చారిత్రాత్మక "గ్రామ స్వరాజ్ మహా సంకల్ప బైక్ యాత్ర"ను చేపట్టనుంది. అక్టోబర్ 2 నుంచి ప్రారంభం కానున్న ఈ యాత్రను పార్టీ జాతీయ అధ్యక్షుడు రాజయోగి కాసాని శ్రీనివాసరావు గౌడ నేతృత్వంలో రాష్ట్రంలోని ప్రతి గ్రామానికి తీసుకెళ్లనున్నారు. ఈ సందర్భంగా కాసాని శ్రీనివాసరావు గౌడ మాట్లాడుతూ గ్రామాలు బలపడితేనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని, అధికార వికేంద్రీకరణ మరియు స్థానిక సంస్థలకు సంపూర్ణ అధికారాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడం, సర్పంచ్‌ల ఆత్మగౌరవాన్ని కాపాడటం, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళలు, రైతులు మరియు యువతకు సామాజిక సాధికారత కల్పించడమే ఈ యాత్ర ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. కేవలం రాజకీయ ప్రచారం కాకుండా, ప్రజల భాగస్వామ్యంతో అవినీతి రహిత ప్రజా పాలనను అందించేందుకు, క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను తెలుసుకుంటూ "సమగ్ర తెలంగాణ" నిర్మాణానికి ఈ మహా యాత్ర దోహదపడుతుందని పార్టీ వెల్లడించింది. ఈ చారిత్రాత్మక ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని జై స్వరాజ్ పార్టీ పిలుపునిచ్చింది.

## వెంకట సాయి నగర్ కాలనీలో సీసీ రోడ్లు మంజూరు చేయండి


- **కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డికి వినతి**



ఇది కద నిజం: రామంతపూర్ భగాయత్ పరిధిలోని వెంకట సాయి నగర్ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణాన్ని తక్షణమే చేపట్టాలని కోరుతూ, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మరియు సీనియర్ జర్నలిస్టు విజయేందర్ రెడ్డి మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కాలనీలో ఇప్పటికే తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులు కల్పించినప్పటికీ, రోడ్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉండటంతో వర్షాకాలంలో విద్యార్థులు, వృద్ధులు మరియు మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సీసీ రోడ్ల మంజూరు కోసం స్థానిక ప్రజాప్రతినిధులు అందించిన సిఫార్సు లేఖలను కూడా ఈ సందర్భంగా ఆయన కమిషనర్‌కు అందజేశారు. దీనిపై కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, రోడ్ల నిర్మాణ ప్రతిపాదనలను పరిశీలించి త్వరితగతిన పరిపాలనా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రాధిక గుప్త, మున్సిపల్ అధికారులు, కాలనీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అయోధ్య రామమందిర నిధులపై పారదర్శక విచారణ జరగాలి

- **ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా, ఎస్ఐటి విచారణ పేరుతో కేసును తప్పుదోవ పట్టిస్తున్నారు**
- **నిధుల ఆరోపణలపై బాధ్యులు నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలి**
- **ఎన్నికల ప్రచారం కోసం శ్రీరాముడు, ఆంజనేయస్వామిలను వాడుకోవడం భక్తులను అవమానించడమే**
- **మతం పేరుతో రాజకీయాలు చేస్తున్న బీజేపీ ప్రభుత్వం**
- **ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ హేమా సుదర్శన్ జిల్లోజు**




ఇది కద నిజం:అయోధ్య రామమందిర నిర్మాణానికి సంబంధించిన 200 కోట్ల రూపాయల నిధుల అవకతవకల ఆరోపణలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ హేమా సుదర్శన్ జిల్లోజు తీవ్రంగా విమర్శించారు. నిధుల ఆరోపణలపై ఎటువంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా, కనీసం నైతిక బాధ్యత వహించి ఎవరూ రాజీనామా చేయకుండా, కేవలం 25 రోజుల తర్వాత ఎస్ఐటి విచారణ పేరుతో కేసును తప్పుదోవ పట్టిస్తున్నారని ఆమె ఆరోపించారు. రామమందిర నిధుల కేసులో వెంటనే పూర్తిస్థాయి పారదర్శక విచారణ జరిపి, నిజాలను దేశ ప్రజల ముందు ఉంచాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా హిందూ దేవుళ్లైన శ్రీరాముడు, ఆంజనేయ స్వామిలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం భక్తుల మనోభావాలను దెబ్బతీసే చర్య అని ఆమె పేర్కొన్నారు. శ్రీరాముడి పేరును రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించడం మానుకోవాలని, ఆయన చూపిన ధర్మం, న్యాయం, సత్యం వంటి విలువలను పాలనలో ఆచరించాలని హేమా సుదర్శన్ జిల్లోజు కేంద్ర ప్రభుత్వానికి పిలుపునిచ్చారు.

## గేదెలను ఢీకొని అదుపు తప్పి పంట కాలువలో పడిన కారు




నెల్లూరు జిల్లా పొదలకూరు(ఇది కద నిజం):- నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం వనంతోపు సమీపంలో గురువారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అల్లూరు నుండి ఆదూరుపల్లికి వెళుతున్న ఓ కారు గేదెలను ఢీకొనడంతో, అదుపు తప్పి, పక్కనే ఉన్న పంట కాలువలో బోల్తా పడింది...

ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికులు క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు , కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు .

## పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మండల విద్యాశాఖ అధికారి



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం, జూలై 9: కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని చౌటకట్టు తండా ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి దేవి సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గత విద్యాసంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది విద్యార్థుల నమోదు సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎఫ్ఎల్ఎన్ ప్రారంభ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఆదేశించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించిన ఆయన, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ప్రియాంక, ఉపాధ్యాయురాలు బబితా పాల్గొన్నారు.

## మైనార్టీ కమ్యూనిటీ చైర్మన్ గా జుక్కల్ ఎమ్మెల్యే

- **మంత్రి శ్రీధర్ బాబు విశ్వాసానికి కృతజ్ఞతలు**



ఇది కద నిజం, ఉమ్మడి నిజామాబాద్ జుక్కల్, జూలై 9: కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజక వర్గం ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు కు మైనారిటీ కమ్యూనిటీ చైర్మన్‌గా తనపై నమ్మకంతో నియమించినందుకు తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబుకు జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నియామకాన్ని తనపై ఉంచిన విశ్వాసానికి నిదర్శనంగా భావిస్తున్నానని పేర్కొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, మైనారిటీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తానని తెలిపారు. తనకు ఈ అవకాశం కల్పించిన మంత్రి శ్రీధర్ బాబుకు ధన్యవాదాలు తెలియజేశారు.

## ఎలినినో ఎఫెక్ట్ దృష్ట్యా పంటల మార్పిడి తప్పనిసరి - జిల్లా కలెక్టర్




నల్లగొండ (ఇది కద నిజం): జిల్లాలో రైతులు సంప్రదాయ వరి సాగుకే పరిమితం కాకుండా, మారుతున్న కాలానికి అనుగుణంగా పంటల వైవిధ్యం వైపు మొగ్గు చూపాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ కోరారు.. జిల్లా కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యానవన, నాబార్డ్, బ్యాంకింగ్, పరిశ్రమలు, డీఆర్డీఓ మరియు సహకార శాఖల అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఈ ఏడాది ఎలినినో ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున, రైతులు వరికి బదులుగా తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలను సాగు చేసేలా ప్రోత్సహించాలని, ఇందుకోసం మండలాల వారీగా ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. యూరియా వాడకాన్ని తగ్గించి, 'నానో యూరియా' వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని ఎరువుల కంపెనీలకు సూచించారు.. వ్యవసాయంలో ఆధునిక సాంకేతికతను జోడించాలని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా వాతావరణ సమాచారాన్ని రైతులకు ఎప్పటికప్పుడు చేరవేసేలా ప్లానింగ్ చేయాలన్నారు.

## కమలాపురంలో రైళ్ల నిలుపుదలపై కదం తొక్కిన ప్రజలు..!!




ఇది కద నిజం న్యూస్ కడపజిల్లా జూలై 09:

కడపజిల్లా.. కమలాపురం పట్టణ కేంద్రంలో రైళ్ల నిలుపుదల కోసం యువత సామాన్య ప్రజలు మీడియా ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీని కొనసాగించారు. స్థానిక రైళ్ల నిలుపుదల సాధన కమిటీ అధ్యక్షతన యువత,ప్రజలు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రి సమీపం నుంచి ప్రారంభమైన ఈ నిరసన భారీ ర్యాలీ కమలాపురం రైల్వే స్టేషన్ వరకు భారీగా కొనసాగించారు. కుల మత పార్టీ లకు అతీతంగా ఏర్పాటు చేసిన ఈ ర్యాలీలో అన్ని పార్టీల వర్గాలు, సామాన్య ప్రజలు యువత, వ్యాపారులు రైతులు, విద్యాసంస్థల యజమాన్యాలు, కళాశాల యజమాన్యాలు, ఉద్యోగులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, వేలాదిగా స్వచ్ఛందంగా పాల్గొని ముక్తకంఠంతో నిరసన సెగనువినిపించారు. కమలాపురంలో రైలు నిలపండి, అది ప్రజల హక్కు. కమలాపురానికి న్యాయం చేయాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఉద్యమ గళం ఢిల్లీ వరకు వినిపించేలా డిమాండ్ చేశారు. అనంతరం కమిటీ సభ్యులు కమలాపురం రైల్వే స్టేషన్‌కు చేరుకుని స్టేషన్ మాస్టర్ శశిధర్కు వినతిపత్రం సమర్పించారు. కరోనా కాలానికి ముందు కమలాపురం రైల్వే స్టేషన్‌లో ఆగిన పలు రైళ్లకు తిరిగి నిలుపుదల కల్పించాలని, ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు.

కమిటీసభ్యులు,మాట్లాడుతూ, రైళ్ల నిలుపుదల లేక విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు, సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కమలాపురం మాత్రమే కాకుండా పరిసర ప్రాంతాల వేలాది మంది ప్రజలకు ఈ స్టేషన్ కీలకమని, రైళ్ల నిలుపుదల పునరుద్ధరిస్తే ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి కమలాపురం ప్రజల న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. తమ డిమాండ్ నెరవేరే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, ప్రజల మద్దతుతో పోరాటాన్ని నిరంతరం కొనసాగిస్తామని రైళ్ల నిలుపుదల సాధన కమిటీ స్పష్టం చేసిందని తెలిపారు..

## ఏపీ రాష్ట్రంలో మళ్లీ కరోనా కలకలం... ఇద్దరు మృతి!



ఇది కద నిజం: ఏపీ రాష్ట్రంలో కరోనా కేసులు మళ్లీ కలకలం రేపుతున్నాయి. వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన ఇద్దరు వ్యక్తులు వైరస్ బారినపడి మంగళవారం మృతి చెందారు. మృతుల్లో ఒకరికి 43 ఏళ్లు, మరొకరికి 60 ఏళ్లపైనే ఉన్నాయని తెలిసింది. మృతులిద్దరికీ ఆర్టీపీసీఆర్ టెస్ట్‌లో పాజిటివ్ అని తేలడంతో తదుపరి నిర్ధారణ పరీక్ష కోసం వారి బ్లడ్ శాంపిళ్లను పుణె వైరాలజీ ల్యాబ్‌కు పంపడానికి కడప జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. 43 ఏళ్ల వ్యక్తి కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృత్యువాత పడగా.. 60 ఏళ్లు పైబడిన వ్యక్తి తమిళనాడులోని సీఎంసీ వెల్లూరులో చికిత్స పొందుతూ మరణించారు. ఈ ఘటన పై మరింత సమాచారం తెలియాల్సి ఉంది

